క్లుప్తంగా

స్త్రీలు బిడ్డలను సన్మార్గంలో నడిపించాలి



పెదకాకాని: బిడ్డలను సన్మార్గంలో నడిపిస్తూ ప్రజా క్షేమం కొరకు నిరంతరం ప్రార్థించే వారిగా స్త్రీలు జీవించాలని వైటీసీఎం వ్యవస్థాపకులు ఎస్తేరు క్వీని అన్నారు. మండల పరిధిలోని నంబూరు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గురువారం ఒకరోజు స్త్రీల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చర్చి కాపరి బందెల రాజు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక లక్ష్యం సాధించే వరకూ నిరంతరం శ్రమించాలన్నారు. ఎదుటి వారి పట్ల జాలి, దయ, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో టీచర్ ఎస్.మేరి వైలెట్, నంబూరు సునీత, ఎం.సీయోనుకుమారి, నంబూరు కమల, హృదయ, నేలపాటి విజయమ్మ, చిలకా పవిత్ర పాల్గొన్నారు.

తురకపాలెంలో గ్రామసభ



గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదికి నూతనంగా చేపట్టాల్సిన పనులను గుర్తించాలని కోరారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యవసాయం, ఇతర వృత్తులు కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి సూర్యప్రకాష్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



పెదకాకాని: మండల పరిధిలోని నంబూరులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి పూజా కార్యక్రమల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని శివాలయం సెంటర్‌లో జొన్నల అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి దసరా నవరాత్రోత్సవాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్సీని ఘనంగా శాలువాతో ఘనంగా సత్కరించారు.

మోదుగులతో మర్యాద పూర్వక కలయిక



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాజిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డిని పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొలకలూరి కోటేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని మోదుగుల నివాసంలో ఆయనను కలిసి శాలువాను కప్పి, పుష్ప గుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా మోదుగుల మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన వెంకటకృష్ణాపురంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన అమ్మిశెట్టి కోటేశ్వరరావు, గుంటూరులో ట్రాక్టర్ స్పేర్‌పార్ట్స్ విక్రయించే దుకాణంలో పనిచేస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఈనెల ఒకటో తేదీ రాత్రి బైక్‌పై ఇంటికి బయలు దేరాడు. గుంటూరు శివారులోని ఎన్టీఆర్ మానససరోవరం వద్ద ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి చేరుకునే సరికి నందివెలుగు వైపు నుంచి వస్తున్న మినీవ్యాన్ ఢీ కొంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కోటేశ్వరరావు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్యారాణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సంధ్యారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

పోలీస్ స్టేషన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- నల్లపాడు పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

గుంటూరు రూరల్: పోలీస్ స్టేషన్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. శుక్రవారం సౌత్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. భౌగోళిక మ్యాప్ పరిశీలన చేసి, ప్రాంతాల వారీగా కేసుల నమోదు వివరాలు, శాంతి భద్రతలకు సంబంధించిన పలు విషయాలపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ, నవీకరణ గురించి పోలీస్ సిబ్బందితో మాట్లాడి, ఎప్పటికప్పుడు రికార్డులను నవీకరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కేసుల నమోదు విధానాన్ని పర్యవేక్షిస్తూ, పెండింగులో ఉన్న కేసుల పురోగతిని వేగవంతం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. రిసెప్షన్‌లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి ప్రజలతో పోలీసులు ప్రవర్తించే తీరు, వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించే విధానం, పోలీస్ అధికారుల దృష్టికి ఫిర్యాదులు తీసుకెళ్లే విధానం తెలుసుకున్నారు. ఫిర్యాదుల స్వీకరణ, వాటిని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాటించవలసిన పారదర్శకత గురించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి నిరంతరం సక్రమంగా పనిచేసే విధంగా సరైన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కేసుల్లో సీజ్ చేసిన వాహనాల విడుదల ప్రక్రియను పరిశీలించి, దానిని చట్టపరమైన నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో పరస్పర చర్చలు జరిపి, విధుల్లో మరింత జాగ్రత్త, క్రమశిక్షణ, పారదర్శకతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు భరోసా కల్పించే విధంగా వారి సమస్యలకు సకాలంలో స్పందిస్తూ, పరిష్కారం చూపే దిశగా కృషి చేసి ఆదర్శంగా నిలపడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సౌత్ డీఎస్పీ భానోదయ, ఎస్పీ సీఐ అలహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో కార్యకర్తలకు గుర్తింపు



డాక్టర్ రూత్ రాణిని అభినందిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: వైఎస్సార్ సీపీలో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని, వారి సేవలను పార్టీ మరువదని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ సీఈసీ సభ్యురాలిగా నియమితులైన పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి శుక్రవారం గుంటూరులోని మురళీకృష్ణ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ ఆమెను సత్కరించి అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తన నియామకానికి సహకారించిన అంబటి మురళీకృష్ణకు రూత్ రాణి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా విజయదశమి వేడుకలు



పొన్నూరు శంకరమఠంలో జమ్మి చెట్టు వద్ద పూజలు



పొన్నూరు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు

పొన్నూరు: విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయం, సాక్షి భావనారాయణ స్వామి ఆలయం, సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయం, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, సాయి మందిరంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, కమిటీలు పర్యవేక్షించారు. వాహనాలకు ఆయుధ పూజ చేశారు.

వేజండ్లలో ఘనంగా ఉరుసు మహోత్సవం



ఉరుసు మహోత్సవంలో అంబటి మురళీకృష్ణ

వేజండ్ల(చేబ్రోలు): గ్రామంలో శుక్రవారం రాత్రి ఉరుసు మహోత్సం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్యార్మీ పండుగ సందర్భంగా ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

పొన్నూరు: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, విజయ దశమి పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని యూనిఫాం, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, సిబ్బంది, పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

7న స్కూల్ గేమ్స్ సెలక్షన్లు

ప్రత్తిపాడు: ఈ నెల 7వ తేదీన మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్ -17 సెలక్షన్లు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కో ఆర్డినేటర్ షేక్ కరీముల్లా తెలిపారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగ, అథ్లెటిక్స్ సెలక్షన్లు జరగనున్నాయని చెప్పారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో ఆడనున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు వారి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌లను తీసుకుని ఉదయం తొమ్మిది గంటలకు క్రీడా ప్రాంగణానికి హాజరుకావాలని కరీముల్లా కోరారు.

ఎన్జీ రంగా వర్సిటీలో గాంధీ జయంతి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం జాతిపిత గాంధీ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద వీసీ డాక్టర్ ఆర్ శారదజయ లక్ష్మిదేవి పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, కంప్ట్రోలర్ డాక్టర్ బీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నల్గొండ జిల్లాలో తెనాలి వాసి మృతి

తెనాలిరూరల్: తెలంగాణలోని నల్గొండ జిల్లాలో తెనాలి వ్యక్తి మృతి చెందాడు. మేనల్లుడిని కాపాడే క్రమంలో నదిలో పడి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక చినరావూరుకు చెందిన కేతావత్ రామునాయక్ (34) తన కుటుంబ సభ్యులతో దసరా కొలుపులకు తెలంగాణలోని నల్గొండ జిల్లా దేవరచర్ల గ్రామంలోని తన బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలసి వెళ్లాడు. దసరా పండుగ కొలుపులను వీక్షించి తన మేనల్లుళ్లతో కలసి గ్రామ సమీపంలోని నదీ తీర ప్రాంతానికి వెళ్లాడు. తనతో వచ్చిన మేనల్లుడు ఉమాకాంత్ (10) నదిలో జారి కొట్టుకుపోతుండగా కాపాడేందుకు రామునాయక్, అతని బంధువు పూర్ణగోపాల భరత్‌నాయక్ నదిలోకి దూకారు. బాలుడి ఆచూకీ తెలియలేదు. అతన్ని కాపాడేందుకు నదిలోకి దూకిన ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. చినరావూరు చెందిన రామునాయక్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహం శుక్రవారం సాయంత్రం తెనాలికి చేరుకుంది.

7న విజయవాడలో ఫ్యాప్టో పోరుబాట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మంగళగిరి టౌన్: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న విజయవాడలో జరిగే రాష్ట్ర ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ కె. నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని కేకే మున్సిపల్ హైస్కూల్‌లో మంగళగిరి ప్రాంతీయ ఫ్యాప్టో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ న్యాయంగా రావాల్సిన ఆర్థిక అవసరాలను ప్రభుత్వం ఇంతవరకు తీర్చలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. తక్షణమే ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళగిరి మండల పరిధిలోని ఉపాధ్యాయులంతా ధర్నాలో పాల్గొనాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో డెప్యూటీ సెక్రటరీ జనరల్ రాజశేఖర్, సుబ్బారెడ్డి, ఖలీద్, ఏరియా కార్యదర్శి సాలార్ బేగ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సైదా నాయక్, మదన్ కుమార్, గోపీచంద్, జోజప్ప, అరుణ్‌కుమార్, ఏడుకొండలు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

దావులూరిపాలెం(కొల్లిపర): విద్యుదాఘాతంతో పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైన సంఘటన గురువారం మండలంలోని దావులూరిపాలెంలో చోటుచేసుకుంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన తల్లి మరియు కుమారై లైన దేవరకొండ మంగమ్మ, మిడ్దే నగ్మాకి చెందిన రెండు పోర్షన్లతో కూడిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. తల్లి, కూతురు ఇద్దరూ కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఆ సమయంలో కూతురు పిల్లలు ఇంటిలో లేక పోవటం వలన ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందిన బీసీ సంఘం నాయకుడు మోర్ల శ్రీను(లాగుల శ్రీను) ఈ విషయం తెలుసుకుని తన సహచరులతో సంఘట స్థలాన్ని పరిశీలించి తన వంతు సాయంగా వారికి రూ.10వేలు సాయం అందించాడు. గ్రామస్తులు మాట్లాడుతూ సర్వం కోల్పోయిన తల్లి, కూతుర్లను స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం దారుణం

కేవీపీఎస్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మంగళగిరి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) మంగళగిరి పట్టణ కార్యదర్శి వై. కమలాకర్ డిమాండ్ చేశారు. పాత మంగళగిరిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, జీవరత్నం, మురళి, విక్టర్ పాల్, భాస్కర్, దావీదు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

తాడేపల్లిలోని 1వ వార్డులోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు అంటించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, కేవీపీఎస్ నాయకులు పల్లె కృష్ణ, ఎన్. విజయరాజు, లక్ష్మయ్య, నీరుడు దుర్గారావు, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: అణగారిన వర్గాల హక్కుల కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం కేవీపీఎస్ అని జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గు రోడ్డులో సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా నేటికీ వివిధ రూపాల్లో వివక్ష కొనసాగడం దారుణమని తెలిపారు. దళితులు, బహుజనులు తమకు రావాల్సిన నిధులు, విధులు, హక్కుల కోసం గళమెత్తాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు దర్శనపు విజయబాబు, వై. బర్నబాస్, కోట బాబూరావు, గాదె సుబ్బారెడ్డి, వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు

తెనాలిరూరల్: గాంధీ జయంతి రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టణంలో గురువారం ఇద్దరు వ్యక్తులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడం ఎక్సైజ్ అధికారుల దృష్టికి వెళ్లింది. ఇఇద్దరు వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్టు తెనాలి ఎక్సైజ్ సీఐ ఏవీ చలం తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనాలు



దుగ్గిరాల: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు పలు ప్రయోజనాలున్నాయని ఏఓ విజయబాబు తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ఉపకరణాలు, ట్రాక్టర్లు, పాల ఉత్పత్తులు, రసాయన ఎరువులు ధరలు తగ్గాయని పేర్కొన్నారు. మండలంలోని చిలువూరులో గ్రామస్తులకు, రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పలు బజార్లలో ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలతో ర్యాలీ నిర్వహించారు. వినియోగదారుడా మేలుకో.. జీఎస్టీ ఫలాలు అందుకో అంటూ నినాదాలు చేశారు. ఒక ట్రాక్టరు కొనుగోలుపై గతంతో పోల్చితే రూ. 50 వేలు తగ్గిందని తెలిపారు. నిత్యావసరాలు, పాదరక్షలు, దుస్తులు, స్టేషనరీ, ఆహారానికి సంబంధించిన పలు వస్తువులపై ధరలు తగ్గాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాణిక్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రోజానమ్మ, ఇంచార్జి ఎంపీడీఓ వి.చంద్ర మోహన్, డెప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెహ్రూ, వెటర్నరీ డాక్టరు సతీష్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు 22వేల మంది పేదలు వివిధ భూముల్లో ఇళ్లు వేసుకుని ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్నారని తెలిపారు. వారిలో మూడు వేల మందికి మాత్రమే మంత్రి నారా లోకేష్ ఇటీవల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మిగిలిన 19 వేల మందికి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు కూడా స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని, వాటిని అర్జీల ద్వారా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఈనెల 13,14,15 తేదీల్లో రిలే దీక్షలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై. కమలాకర్, పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్, సీనియర్ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

సీఆర్డీఏ జీఆర్‌ఎం నోడల్ అధికారిణి జయశ్రీ



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

తాడికొండ: రాజధాని ప్రాంత రైతుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఏపీ సీఆర్డీఏ గ్రీవెన్స్ రెడ్రెస్ మేనేజ్‌మెంట్ (జీఆర్‌ఎం) నోడల్ అధికారిణి పి. జయశ్రీ తెలిపారు. రాజధాని ప్రాంత రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం తుళ్లూరులోని ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు రైతులు, వ్యవసాయ కూలీలు పిటిషన్లను నోడల్ అధికారిణికి సమర్పించారు. త్వరితగతిన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. పలు ఫిర్యాదులను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చూపవద్దని అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం గ్రీవెన్స్‌లో మొత్తం 25 ఫిర్యాదులు రాగా భూమికి సంబంధించి – 19, డెవలప్మెంట్ ప్రమోషన్ – 4, హ్యూమన్ రిసోర్సెస్ – 1, ఆఫీస్ మేనేజ్‌మెంట్ – 1 వచ్చినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం. శేషిరెడ్డి, పి. పద్మావతి, బి. శ్రీనివాస నాయక్, జి. భీమారావు, కె.ఎస్. భాగ్యరేఖ, జోనల్ జాయింట్ డైరెక్టర్ (డెవలప్మెంట్ ప్రమోషన్) సీహెచ్. మధుసూదన్‌రావు, సంక్షేమ విభాగం డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు !



శిబిరంలో మాట్లాడుతున్న కూరపాటి స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన నాయకులు ఆదినారాయణ, సాంబశివరావు, నాగేశ్వరరావు, సుభానీలతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు రావాల్సిన బకాయిల కోసం 30 సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నారని, 304 రోజులుగా ఎండనక, వాననక దీక్షలు చేస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు సాంబశివరావు, నాగేశ్వరరావు, ఇశ్రాయిల్, ఇమాంబి, శారమ్మ, రమాదేవి, రిబ్కా, శివకుమారి, అన్నమ్మ, గురవయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలు

దుగ్గిరాల: బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం దుగ్గిరాలలో జరిగింది. మండలంలోని తుమ్మపూడికి చెందిన వై.అరవింద్ తెనాలి వెళుతుండగా దుగ్గిరాల సినిమా హాలు సమీపంలో పంది అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో అరవింద్ రోడ్డుపై పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కారులో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు.